క్లుప్తంగా

కరాటేలో విద్యార్థి ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనభరిచిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కురుపాం: స్థానిక మహాలక్ష్మీ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి పువ్వల గిరి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్ – 19 విభాగం కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కళ్యాణ్, కరాటే కోచ్ కె.నరేష్ తెలిపారు. ఈ మేరకు ప్రతిభ చూపిన విద్యార్థిని గురువారం కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

సారాతో వ్యక్తి అరెస్టు



సారా నిందితుడు రాజన్నతో ఎస్ఐ

భామిని: మండలంలోని కొత్తగూడకు చెందిన బిడ్డిక రాజన్న 80 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకొని గురువారం అరెస్టు చేసినట్టు బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావు తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు కొత్తగూడ సమీపంలో మాటువేసి పట్టుకొన్నట్లు వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో ఆన్‌లైన్ టెలీ రేడియాలజీ సర్వీసులు



రేడియాలజీ రిపోర్టు చూపిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం మరో పరికరం అందుబాటులోకి వచ్చింది. ఇకపై ఆన్‌లైన్ టెలీ రేడియాలజీ సర్వీసులు రోగులకు అందనున్నాయి. గురువారం కృష్ణా డయాగ్నస్టిక్స్ ప్రతినిధులు దీన్ని ఇన్‌స్టలేషన్ చేశారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ఎక్స్‌రే రిపోర్టు వస్తుందని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఎటువంటి ఖర్చు లేకుండా ఈ సేవలందిస్తామన్నారు.

సమాధుల వద్ద క్రైస్తవుల ప్రార్థనలు



గుమ్మలక్ష్మీపురం: పి.లేవిడిలో సమాధుల వద్ద ప్రార్థనలు



భామిని: ప్రేమగిరి సమీపంలోని సమాధుల వద్ద కొవ్వొత్తుల వెలుగులు

గుమ్మలక్ష్మీపురం: మరణించిన తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్ద గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు చెందిన క్రైస్తవులు గురువారం ప్రార్థనలు చేసారు. ప్రతీ ఏటా నవంబర్ నెలలో సమాధుల పండుగను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే మరణించిన తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి పూలు, పళ్లు, గతంలో వారు తినే ఆహార పదార్థాలు తీసుకెళ్లి ఉంచి, కొవ్వొత్తి దీపాలు పెట్టి వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేసారు. కార్యక్రమంలో భాగంగా పలువురు పాస్టర్లు, ఫాదర్లు ప్రసంగిస్తూ బ్రతికినంత కాలం మంచిగా జీవించి పాపాల నుంచి విముక్తి పొందాలని ఉపదేశించారు.

ఘనంగా సమాధుల పండుగ

భామిని: క్రైస్తవ విశ్వాసకులు గురువారం తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్ద సమాధుల పండుగ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నవంబర్ 2న సమాధుల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు క్రైస్తవులు తెలిపారు. బత్తిలి, భామిని, నల్లరాయిగూడ ఆర్‌సీఎం చర్చల పరిధిలో విశ్వాసకులచే ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ప్రేమగిరిపై గల చర్చ్‌లోనూ ఆదివాసీ గిరిజన విశ్వాసకులు ప్రార్థనలు చేసారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

పాలకొండ: పట్టణంలోని న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహార లోపంతో ఉన్న చిన్నారులకు పౌష్టికాహార కిట్లు గురువారం పంపిణీ చేశారు. క్రైస్ట్ పర్ ది లాస్ట్ ఇండియా సహకారంతో బాల బాలికలకు న్యూట్రీషన్ ఫుడ్ అందించామని పాస్టర్ ఐజక్ కలపాల బి ఎస్ బెన్హర్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సహకారం అందించారు.

మాట ఇస్తే మడమ తిప్పం

- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మాట ఇస్తే మడమ తిప్పమని ... కురుపాం నియోజకవర్గ అభివృద్ధే తన ముందున్న లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పరిధిలో జుంబిరి, నాయుడుగూడ, పెదగూడ గ్రామాలకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.3కోట్ల 17 లక్షలతో ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 4.80 కిలోమీటర్ల బీటి రహదార్లు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రహదార్లు మంజూరు చేసామని మాట ఇస్తే మడమ తిప్పే పరిస్థితి ఉండదన్నారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల పాలనలో సగం సమయం కరోనాతో యుద్ధం చేసి లక్షల మంది ప్రాణాలను రాష్ట్ర ప్రభుత్వం కాపాడిందని, ఇటువంటి పరిస్థితిలో కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అన్నింటిని అమలు చేసి ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. కురుపాం నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లో కూడా అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ప్రతీ గిరిజన గ్రామానికి రహదారి, తాగునీరు, వైద్యం, విద్య అందే విధంగా చర్యలు చేపట్టామన్నారు. గ్రామ సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీ రావు, రంగారావు, ఎంపీటీసీలు గుడారి విద్యారాణి, రాజేశ్వరి, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకరరావు, అయ్యరక, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు గవర విజయ్, ఆనిమి ఇందిరాకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంకటరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు ఐటీడీఏ ఇంజినీరింగ్ డీఈ ఎస్.సింహాచలం, ఏఈ అప్పారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన ఇంజినీర్లు



ఏకలవ్య స్కూల్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఈఈ సింహచలం, డీఈఈ కృష్ణమోహన్

భామిని: గిరిజన ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు, ప్రతిపాదిత పనులను టీడబ్ల్యూడీ ఈఈ ఎం.సింహచలం పర్యవేక్షణలో ఇంజినీర్లు గురువారం పరిశీలించారు. మండలంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు గుర్తించారు. డీఈఈ కృష్ణమోహన్‌తో కలిసి భామిని ఏకలవ్య గిరిజన మోడల్ స్కూల్ భవనాలకు వెళ్లే దారికి సుమారు రూ.40లక్షల వ్యయం కాగల రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలన్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రి భవనం, మురుగునీటి కాలువ, తాలాడలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ కాలువ, మూలగూడ రోడ్డు, డోకులగూడ రోడ్డు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఈ సత్యనారాయణ, డబ్ల్యూఐ సీహెచ్ భీష్మ ఉన్నారు.

అటవీ శాఖ ట్రెంచీలు ఆదుకుంటున్నాయి...



ట్రెంచీలలో నీరు తాగుతున్న ఏనుగుల గుంపు

భామిని: తివ్వాకొండల చుట్టూ అటవీ శాఖ ఆధ్వర్యంలో తవ్వించిన ట్రెంచీలు ఎట్టకేలకు ఉపయోగపడుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో తాగునీరు లేక కొండలు దిగి వచ్చిన ఏనుగుల గుంపు గొంతులు తడుపుకొంటున్నాయి. భామిని మండలం ఇసుకగూడ – సన్నాయిగూడల మధ్య కొండ దిగువన గల ట్రెంచీ గోతులలో చేరిన నీటితో ఏనుగులు సేద తీరుతున్నాయి. ట్రెంచీలు కొండ దిగువకు ఏనుగులు రాకుండా అడ్డుతున్నట్లు గిరిజనులు చెబుతున్నారు. ఏనుగులు ట్రెంచీల ఆవలే ఉన్న పంటలు, తోటలలో తిష్ట వేస్తున్నాయి.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

గుమ్మలక్ష్మీపురం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి అక్టోబర్ 30వ తేదీన అమరావతిలో ఏపీవైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలత తదితరులతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌టీఎఫ్ అధ్యక్షుడు ఎం.సీతన్న తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న ఫేషియల్ యాప్‌కు సంబంధం లేకుండా జీతాలు చెల్లించాలని, వృత్తి విద్యా బోధకుల పెన్షనరీ బెనిఫిట్స్ అమలుపర్చాలని, జీతాలు ఒకటో తేదీకే ఖాతాల్లో జమ చేయాలని, ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న భాషా, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసారన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొనట్లు సీతన్న తెలిపారు.

ప్రజల చెంతకే వైద్యం



సీతంపేట: సోమగండిలో జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు

ప్రజారోగ్య రక్షణ కోసం రాష్ట్రంలో వినూత్నంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలతో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయి. శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. అవసరమైన మందులు అందుకుంటూ తమ వద్దకే వైద్య సేవలు రావడంతో సంబరపడుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జియ్యమ్మవలస: పరజపాడులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శంకరరావు

గర్భిణులకు చీరల పంపిణీ



వైటీసీలో గర్భిణులకు చీరలు, పసుపు, కుంకుమల అందజేత

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వైటీసీలోని గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహంలో చేరిన 46 మంది గర్భిణులకు సిగిరి ఫౌండేషన్ సమకూర్చిన చీరలు, పసుపు, కుంకుమ, గాజులతో పాటు రొట్టెలను ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ తోటపల్లి దేవస్థానం బోర్డు డైరెక్టర్/సిగిరి ఫౌండేషన్ ప్రతినిధి పాత్రోతో కలిసి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాత్రో మాట్లాడుతూ ఇకపై గర్భిణుల వసతిగృహంలో చేరిన ప్రతీ గర్భిణికి వీటిని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైటీసీ మేనేజర్ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

గరుగుబిల్లి: తోటపల్లి పాత రెగ్యులేటర్‌ను ఆనుకొని ఎడమ కాలువ పరిధిలో వున్న బ్రిటీష్ కాలం నాటి కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి పరిధిలోని కల్వర్టుపై నుంచి కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా తదితర ప్రాంతాలకు నిత్యం భారీ వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఈ ప్రాంతీయులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ద్విచక్ర వాహనం, కారు, ఆర్టీసీ బస్సు కల్వర్టును ఢీకొనడంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అధికారులు స్పందించి శిథిలమైన కల్వర్టును పునర్నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీ



అంధవరపు వీధిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతోష్

వీరఘట్టం: మండలంలో పింఛన్ల పంపిణీ గురువారం రెండో రోజు కూడా జరిగింది. మంచంపై లేవలేని పరిస్థితిలో ఉన్న వృద్ధునికి, వేలిముద్రలు పడని వారికి దగ్గరుండి వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి



సుంకిలో రీసర్వేపై ఆరా తీస్తున్న జేసీ గోవిందరావు

గరుగుబిల్లి: జగనన్న భూహక్కు రీసర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని సుంకి రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా సర్వేను నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహిస్తున్న భూములకు సంబంధించి రైతులకు ముందుగానే సమాచారాన్ని అందించాలన్నారు. సర్వే నిర్వహణలో గ్రౌండ్ ట్రూత్ పక్కాగా ఉండాలన్నారు. పార్వతీపురానికి సంబంధించి 462 గ్రామాలకుగాను 368 గ్రామాల్లో రీసర్వే ప్రారంభం అయ్యిందన్నారు. రెండు విడతల్లో 147 గ్రామాల్లో సర్వేను నిర్వహించడం జరిగిందన్నారు. 94 గ్రామాల్లో అటవీ శాఖ, ఒడిశా సరిహద్దుల సమస్య ఉందని, ఈ ప్రాంతాల్లో సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపించడం జరుగుతుందన్నారు. మూడో విడతలో సర్వే ప్రారంభమైందన్నారు. సర్వే పూర్తయిన తరువాత సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరిశీలనలో ఎంపీపీ ఉరిటి రామారావు, డివిజనల్ సర్వే అధికారి కె.సూర్యారావు, డీటీ శివన్నాయుడు, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్ఐటీఐలో స్వచ్ఛత కార్యక్రమం



భద్రగిరి ఆర్ఐటీఐలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో స్వచ్ఛత క్యాంపెయిన్ 3.0ను గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఇన్‌స్ట్రక్టర్లతో కలిసి ఐటీఐ పరిసరాలను శుభ్రం చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయన్నారు.

సీస్ టెస్ట్ పకడ్బందీగా నిర్వహించాలి : డీఈఓ



కేజీబీవీలో సీస్ ప్రాక్టీస్ పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో దాగి ఉన్న అభ్యాసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు శుక్రవారం నిర్వహించే సీస్ (స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్) టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కొత్తగూడ జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్ (బాలుర), కేడీ కాలనీ జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్(బాలికలు), భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్, బాయ్స్ స్కూల్స్, టిక్కబాయి జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్ (బాయ్స్), ఏకలవ్య ఆదర్శ గురుకుల బాలబాలికల పాఠశాలలను సందర్శించారు. సీస్ పరీక్షలో పాల్గొనేందుకు సిద్ధమైన 3, 6, 9 తరగతుల విద్యార్థులు రాస్తున్న ప్రాక్టీస్ పరీక్షలను పరిశీలించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించే సీస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ బి.చంద్రశేఖర్ ఉన్నారు.

15న చలో విజయవాడ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు గురువారం దీనికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. సీపీఎం ప్రచార భేరి ముగింపు సభ విజయవాడలో చేపడుతున్నామని ఈ సభకు అన్ని వర్గాలు మద్దతు అందించాలని కోరారు. సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పెత్త ఎత్తున చలో విజయవాడపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కె.రాము, బి.పట్టాభి, సీహెచ్ సంజీవి, పి.వేణు, బి.దర్గారావు పాల్గొన్నారు.

పాఠశాల పరిశుభ్రతపై అసంతృప్తి



అర్ధలి పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సోంబాబు

పాలకొండ రూరల్: మండలంలోని అర్ధలి పాఠశాల పరిసరాల పరిశుభ్రత విషయంలో గ్రామస్తుల సహకారం అవసరమని ఎంఈఓ – 2 కె.సోంబాబు అన్నారు. సదరు పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. అక్కడి పరిసరాలు సక్రమంగా లేకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు బడి చేరుకునే రహదారిలో పూర్తిగా పారిశుధ్య లోపం చోటుచేసుకుందన్నారు. గ్రామానికి చెందిన పాఠశాలను కాపాడుకోవాల్సిన క్రమంలో గ్రామస్తుల చొరవ చూపాలన్నారు. తమ పిల్లల ఆరోగ్యాన్ని, భద్రతను దృష్టిలో పెట్టుకుని సహకరించాల్సి ఉందన్నారు. కనీసం రహదరి లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించాలని కోరారు. ఉపాధ్యాయులకు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు తోడ్పాటు అందిస్తే ప్రభుత్వ బడి మరింత మెరుగ్గా మారుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న సేవలు, బోధనపై ఆరా తీసారు. హెచ్ఎం వరలక్ష్మికి పలు సూచనలు చేసారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు.

తాగునీటి బోరు ఏర్పాటు



లుంబూరు జగనన్న కాలనీ వద్ద తాగునీటి బోరు తవ్విస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామంలో 24 కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ గృహ నిర్మాణాలకు స్థలం కేటాయించింది. ఇక్కడి జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పన యంత్రాంగం దృష్టి సారించింది. ఈ క్రమంలో గురువారం రూ.2లక్షల వ్యయంతో తాగునీటి బోరు ఏర్పాటును సర్పంచు తిర్లంగి ఉపేంద్రకుమార్, ఉప సర్పంచు పడాల రామచంద్రరావుల నేతృత్వంలో చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా ఈ బోరు తవ్వించటం జరిగిందని, త్వరలో విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు ప్రజా ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ తోడ్పాటు పట్ల గృహ లబ్ధిదారులు ఆనందం వ్యకం చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలి



ఎస్ఐలకు సూచనలు అందిస్తున్న సీఐ మురళీధర్

పాలకొండ రూరల్:

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని పాలకొండ సీఐ కె.మురళీధర్ అన్నారు. పాలకొండ పోలీస్ సర్కిల్ పరిధిలో ఎస్ఐలతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ప్రమాదాలు అధిగమించే క్రమంలో తీసుకోవాల్సిన చర్యలపై ఎస్ఐలు తమ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. ముఖ్యంగా విజుబుల్ పోలీసింగ్‌తో పాటు ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న దీపావళి పండగను దృష్టిలో పెట్టుకుని అక్రమంగా మందుగుండు సామగ్రి తరలింపు, నిల్వ చేయటం, అమ్మకాలు జరగకుండా చూడాలన్నారు. ఈ తరహా చర్యలకు గతంలో పాల్పడిన వారిపై నిఘా వేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



దిగువ మండ పాఠశాలలో విద్యార్థులకు ఆటపాటలతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులు కూడా అవగాహన పెంచుకోవాలని ఆర్‌వైఎస్ఎస్ సిలబస్ డవలప్‌మెంట్ సీనియర్ కన్సల్టెంట్ డి.పారినాయుడు, కన్సల్టెంట్ టి.శివాజి అన్నారు. మండలలోని మండ, దిగువమండ గ్రామాల్లోని పాఠశాలల్లో బడి నుంచి పొలంబడికి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీరు ప్రకృతి వ్యవసాయ అంశాలు జోడించి తయారు చేసిన గేయాలు, పాటలను విద్యార్థులచే పాడించి, పాఠాలను చదివించారు. వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయానికి గల తేడాలు వివరిస్తూ వ్యవసాయం పట్ల విద్యార్థులకు గల అభిప్రాయాలను సేకరించారు. విద్యార్థులతో కలిసి కిచెన్‌గార్డెన్‌లను సందర్శించి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి పాఠ్యాంశాల్లో ప్రయోగాత్మకంగా ప్రకృతి వ్యవసాయ అంశాలు జోడించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.దేవానంద్, సర్పంచ్ నిమ్మక హైమావతి, ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ వి.సన్యాసిరావు, ఎంటీ గోరిశెట్టి నిర్మల ఉన్నారు.